క్లుప్తంగా

చర్యలు తీసుకోవాలి
వీణవంక: డబ్బులు తీసుకొని పట్టా చేయడంలేదని వారిపై కేసు నమోదు చేయాలని మండలంలోని హిమ్మత్‌నగర్ గ్రామానికి చెందిన మ్యాక రమేశ్ అనే రైతు కరీంనగర్ సీపీ అభిషేక్ మహంతికి ఫిర్యాదు చేశారు. 7.25 ఎకరాల భూమి ఓ వ్యక్తి నుంచి కొనుగోలు చేయగా మొత్తం డబ్బులు చెల్లించినా ఇంకా 1.27ఎకరాల భూమి పట్టా చేయడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. అప్పటి పోలీస్ అధికారులు తనను వేధించారని తప్పుడు కేసులు నమోదు చేశారని ఆరోపించారు. సీపీ సూచన మేరకు ఏసీపీని కలిశానని రమేశ్ తెలిపాడు. తనపై తప్పుడు కేసులు బనాయించిన అప్పటి అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నిధులు మంజూరు
చిగురుమామిడి: మండలంలోని 17 గ్రామాలకు రాష్ట్ర ప్రభుత్వం బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా వివిధ పనులు చేపట్టేందుకు రూ.పదిలక్షల నిధులు మంజూరు చేసిందని ఎంపీడీఓ ఖాజామొయినోద్దీన్ తెలిపారు. బుధవారం చిగురుమామిడిలో విలేకర్లతో మాట్లాడారు. ఆరు పెద్ద గ్రామపంచాయతీలకు రూ.75వేల చొప్పున, పదకొండు చిన్న గ్రామ పంచాయతీలు రూ.50వేల చొప్పున మంజూరయ్యాయని, నిధులతో బతుకమ్మ ఏర్పాట్లు, మురుగుకాల్వలు శుభ్రం, దోమల నివారణ మందు పిచికారీ, తదితర పనులు చేయాలని ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులను కోరారు.

రాంలీలకు తరలిరండి
తిమ్మాపూర్: మండలంలోని ఎల్ఎండీ కాలనీలో దసరా రోజు సాయంత్రం నిర్వహించే రాంలీలా వేడుకలకు జిల్లా నలుమూల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని ఉత్సవ కమిటీ నిర్వాహకులు కోరారు. శనివారం సాయంత్రం ఐదుగంటలకు వేడుకలు ప్రారంభమవుతాయని, ముఖ్య అతిథులుగా మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ.. అతిథులుగా కలెక్టర్ పమేలా సత్పతి, సీపీ అభిషేక్ మహంతి, ఇతర ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు హాజరవుతారని, వేడుకలకు వచ్చేవారి వాహనాల కోసం శ్రీతాపాల లక్ష్మీనరసింహ స్వామి ఆలయం, శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో పార్కింగ్ ఏర్పాటు చేశామని, కుటుంబ సభ్యులతో తరలిరావాలన్నారు.

సన్మానం
శంకరపట్నం: మండలంలోని కరీంపేట మాజీ సర్పంచ్ కేతిరి వెంకట్‌రెడ్డిని తెలంగాణ ఉద్యమకారులు బుధవారం సన్మానించారు. యూపీఏ ప్రభుత్వం తెలంగాణ ఏర్పాటు కోసం శ్రీకృష్ణ కమిటీ ఏర్పాటు చేయగా కమిటీ సభ్యుడు దుగ్గల్ కరీంపేట గ్రామ పంచాయతీలో గ్రామస్తుల అభిప్రాయం తెలుసుకున్నారు. రాష్ట్రం ఏర్పాటులో జాప్యం చేస్తున్నారని వెంకట్‌రెడ్డి సర్పంచ్ పదవికీ రాజీనామా చేసి మండలంలోని తెలంగాణ వాదులకు బాసటగా నిలిచారు. ఉద్యమంలో వెంకట్‌రెడ్డి సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి, మల్లేశ్, కుమార్, అంకుష్, శ్రీనివాస్, వెంకటేశం, కోటిలింగం ఉన్నారు.

ఓటర్ నమోదుపై అవగాహన
శంకరపట్నం: ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆయా రాజకీయపార్టీ నాయకులతో డిప్యూటీ తహసీల్దార్ మల్లేశం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ ప్రీతి, షారూక్, సాయిప్రకాశ్, ఆరీఫ్, రాజిరెడ్డి ఉన్నారు.

గ్యాప్ సర్టిఫికెట్ ఇస్తలేరు
గన్నేరువరం: పైచదువులు చదవడానికి అవసరమైన గ్యాప్ సర్టిఫికెట్ కోసం తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నా ఇవ్వడం లేదని మైలారం గ్రామానికి చెందిన మామిడి మహేశ్ వాపోయాడు. బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద మాట్లాడారు. ఆర్థిక ఇబ్బందులతో 2020లో చదువు ఆపేయాల్సి వచ్చిందని, 2022లో మలేషియా వెళ్లి అనివార్య కారణాలతో తిరిగి వచ్చి గంగాధర మండలం శ్రీవాణి కాలేజీలో ఎంబీఏ చదువుతున్నానని, స్టడీ గ్యాప్ సర్టిఫికెట్ కావాలని సెప్టెంబర్ 5వ తేదీన తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నానని తెలిపాడు. దీనిపై తహసీల్దార్ నరేందర్ మాట్లాడుతూ.. మహేష్ సమర్పించిన దరఖాస్తులను పరిశీలించిన తరువాత సర్టిఫికెట్ ఇస్తామని తెలిపారు.

వాహనాల తనిఖీ
చిగురుమామిడి: మండలంలోని చిన్నముల్కనూర్‌లో హుస్నాబాద్-కరీంనగర్ ప్రధాన రహదారిపై తిమ్మాపూర్ సీఐ కె. స్వామి, చిగురుమామిడి ఎస్సై బి. రాజేశ్ బుధవారం సాయంత్రం వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహన డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలుశిక్షతో పాటు లైసెన్స్‌లు రద్దు చేస్తామన్నారు. తనిఖీల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

'బతుకమ్మ చీరలేవి'
గన్నేరువరం: బతుకమ్మ పండుగకు కాంగ్రెస్ ప్రభుత్వం చీరలు పంపిణీ చేయలేదని బీఆర్ఎస్ గునుకులకొండాపూర్ గ్రామ అధ్యక్షుడు న్యాలపట్ల శంకర్ అన్నారు. బుధవారం గ్రామంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టేలా ఏటా ఆడపడుచులకు చీరలు పంపిణీ చేసిందని ఈసంవత్సరం చీరల ఊసేలేదని విమర్శించారు. ఇది మహిళలను అవమానపరచడమేనని పేర్కొన్నారు.



సంప్రదాయాలకు ప్రతీక

ఇల్లందకుంట: బతుకమ్మ తెలంగాణ ప్రజలకు పెద్ద పండగ. బతుకమ్మ అంటే పూలనే దేవుడిగా తొమ్మిదిరోజుల పాటు పూజించే పండగ. పండుగ వచ్చిందంటే పిల్లలు, పెద్దలతో ఇళ్లల్లో సందడి నెలకొంటుంది. ఉద్యోగం, వ్యాపారం నిమిత్తం వివిధ ప్రాంతాల్లో స్థిరపడినవారు సొంత ఊళ్లకు వచ్చి కుటుంబ సమేతంగా ఆనందంగా పండగ జరుపుకుంటారు.
– ఎలిగేటి లావణ్య, కేజీబీవీ ప్రిన్సిపాల్, ఇల్లందకుంట

ప్రకృతి పండుగ

ఇల్లందకుంట: తంగేడు గునుగు, సీతజెడ వంటి పూలు తెచ్చి బతుకమ్మను పేర్చి అందులో గౌరమ్మను పెట్టి సాయంత్రం ఆడుతాం. బతుకమ్మను ఎత్తుకొని డప్పు చప్పుళ్ల మధ్య మైదానానికి వెళ్లి అందరం ఒకదగ్గర బతుకమ్మలు పెట్టి చుట్టూ తిరుగుతూ ఆడుకోవడం చాలా ఇష్టం.
– నాగండ్ల అను, ఉద్యోగి, ఇల్లందకుంట

తొమ్మిది రోజులు సందడి

ఇల్లందకుంట: తొమ్మిదిరోజుల పాటు బతుకమ్మను పేర్చి సాయంత్రం పట్టువస్త్రాలు, ఆభరణాలు ధరించి ఆడుకోవడానికి వెళ్లడం నాకు చాలా ఇష్టం. చిన్ననాటి స్నేహితులు, బంధువులు అందరం కలుస్తాం, ఒకరినొకరు పలుకరించుకోవడం అంటే ఒక బతుకమ్మ పండగతోనే సాధ్యం. పండుగతో ఇళ్లల్లో ఎంతో సందడి వాతావరణం ఉంటుంది. ఇళ్లు నూతన కళ సంతరించుకుంటాయి.
– మార్క హేమలత, గృహిణి, ఇల్లందకుంట

తూతూమంత్రంగా ఏర్పాట్లు

- నేడే సద్దుల బతుకమ్మ
- నిండుకుండలా చెరువులు
- సౌకర్యాలు అంతంత మాత్రమే
- గ్రామస్తుల నుంచి వెల్లువెత్తుతున్న విమర్శలు
- నిమజ్జనంలో అప్రమత్తత కీలకం


కాట్రపల్లి గ్రామంలో చెరువు వద్దకు వెళ్లే దారి పక్కన ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు


ప్రమాదకరంగా కనుకులగిద్దె గ్రామంలోని చెరువు

హుజూరాబాద్‌రూరల్: తెలంగాణ ఆడపడుచులు బతుకమ్మ వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో తొమ్మిదిరోజుల పాటు జరుపుకుంటారు. సద్దుల బతుకమ్మ రోజున అంతే భక్తితో బతుకమ్మను నీటిలో నిమజ్జనం చేస్తారు. గ్రామాల్లో వేడుకలు వైభవంగా జరుపుకుంటారు కానీ ఈ ఏడాది అసౌకర్యాల మధ్య జరుగుతుందని మహిళలు, గ్రామస్తుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. హుజూరాబాద్ మండల వ్యాప్తంగా 19 జీపీలు, అనుబంధ జీపీలను కలుపుకొని 23 గ్రామాలున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు గ్రామాల్లోని చెరువులు జలకళను సంతరించుకున్నాయి. కొన్ని చెరువులు నిండుకుండలా మారి ప్రమాదకరంగా ఉన్నాయి. నిమజ్జనం రోజు వర్షం కురిస్తే ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని మహిళలు వాపోతున్నారు. బతుకమ్మలను గ్రామ శివారులోని చెరువుల్లో నిమజ్జనం చేయనుండగా చాలా గ్రామాల్లో చెరువుల వద్ద బతుకమ్మ నిమజ్జనానికి సంబంధించిన ఏర్పాట్లు అరకొరగా చేశారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

మార్క్ చూపని ప్రత్యేకాధికారుల పాలన

సర్పంచుల పదవీకాలం ముగిసి ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభమైనా పాలనలో వారి మార్క్ కనిపించడం లేదంటూ ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. పేరుకే ప్రత్యేకాధికారుల పాలన తప్పా సౌకర్యాలు కల్పనలో ఎలాంటి శ్రద్ధ చూపటం లేదని, సద్దుల బతుకమ్మ ఏర్పాట్లు తూతూమంత్రంగా చేశారని మహిళలు వాపోతున్నారు. సర్పంచుల కాలంలో చెరువుల వద్ద విద్యుత్ దీపాలతో పాటు చెరువు వద్దకు వెళ్లేందుకు రోడ్లు మరమ్మతు, చెరువుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేసేందుకు మెట్లు, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేసేవారు. చెరువుల వద్ద బతుకమ్మ ఆడేందుకు వీలుగా స్థలాలను చదును చేయించేవారు. కానీ సర్పంచుల పదవీకాలం ముగియడంతో కొన్ని గ్రామాల్లో మాజీ సర్పంచులు సొంతంగా పండుగకు ఏర్పాట్లు చేయిస్తుండగా మరికొన్ని చోట్ల ఉపాధి హామీ కూలీలతో, గ్రామ పంచాయతీకి సంబంధించిన ట్రాక్టర్‌తో పనులు చేయిస్తున్నారు. చాలా పల్లెల్లో లైటింగ్, మంచినీటి, ఇతర సదుపాయాలు లేవని మహిళలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

నిధులు విడుదల చేయాలి

గ్రామంలో బతుకమ్మ పండుగకు ఎలాంటి ఏర్పాట్లు చేయకపోవడంతో సొంత నిధులతో ఏర్పాట్లు చేయిస్తున్నా. పండుగ వేళ మహిళలు ఇబ్బందులు పడొద్దన్న ఉద్దేశంతో నిర్ణయం తీసుకున్నా. తెలంగాణకు పెద్ద పండుగ బతుకమ్మకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు విడుదల చేస్తే బాగుంటది.
– కొడిగూటి శారద, మాజీ సర్పంచ్, శాలపల్లి–ఇందిరానగర్

నామమాత్రంగా పనులు

సద్దుల బతుకమ్మకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో గ్రామపంచాయతీ ట్రాక్టర్, ఉపాధి హామీ కూలీల ద్వారా బతుకమ్మ ఆడే ప్రాంతంలో నామామాత్రంగా పనులు చేయించి చేతులు దులుపుకుంటున్నారు.పండుగ నిర్వహణకు నిధులు విడుదల చేయకపోవడం దురదృష్టకరం.
– బింగి కరుణాకర్, మాజీ సర్పంచ్, రంగాపూర్

జీపీ గ్రాంట్ల ద్వారా ఏర్పాట్లు

గ్రామాల్లో జరిగే సద్దుల బతుకమ్మ, దసరా పండుగకు సంబంధించిన ఏర్పాట్లను గ్రామ పంచాయతీ గ్రాంట్ల ద్వారా వినియోగించుకునేలా చర్యలు చేపడుతున్నాం. ఆయా గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారుల ఆధ్వర్యంలో పండుగకు ఏర్పాట్లు జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం.
– టి. సునీత, ఎంపీడీవో, హుజూరాబాద్

జంతు జనన నియంత్రణ కేంద్రం ప్రారంభం
హుజూరాబాద్‌రూరల్: పట్టణ శివారు బోర్నపల్లి వెటర్నరీ ఆసుపత్రి ఆవరణలో నూతనంగా నిర్మించిన జంతు జనన నియంత్రణ కేంద్రాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ రాధిక ప్రారంభించారు. కమిషనర్ సల్వాది సమ్మయ్య, మేనేజర్ ఆర్. భూపాల్ రెడ్డి, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ సాంబరాజు, శానిటరి ఇన్‌స్పెక్టర్ కిషన్‌రావు ఉన్నారు.

నిధులు విడుదల చేయాలి
జమ్మికుంట: హుజూరాబాద్ నియోజకవర్గంలోని దళితబంధు లబ్ధిదారులకు రెండో విడుత నిధులు విడుదల చేసి ఆదుకోవాలని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతంను బుధవారం జమ్మికుంట పట్టణానికి చెందిన దళితరత్న అవార్డు గ్రహీత అంబాల ప్రభు హైదరాబాద్‌లో కలిసి విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం మొదటి విడుతగా రూ.ఐదులక్షలు విడుదల చేసిందని, రెండో విడుత నిధులు లబ్ధిదారుల ఖాతాల్లో ఫ్రీజ్ చేసి ఉన్నాయని, సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి వెంటనే వాటిని విడుదల చేసి ఆర్థికంగా ఆదుకోవాలన్నారు.

'హైసా'లో కిట్స్ అధ్యాపకులు
హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సింగాపూర్ గ్రామం కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకులు హైదరాబాద్‌లో హైసా(హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్‌ప్రైజెస్ అసోసియేషన్) ఇన్ఫోసిస్, టాస్క్ ఆధ్వర్యంలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మిషన్ లెర్నింగ్, జావా ఫుల్‌స్టాక్, డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్‌లో జరిగిన శిక్షణలో పాల్గొన్నారని కళాశాల డైరెక్టర్ డాక్టర్ కందుకూరి శంకర్ తెలిపారు. అధ్యాపకులు రఘు, దీపక్, స్వప్న, సృజన, అమర్నాథ్, విక్రమ్, డాక్టర్ యోగేశ్ పుండలిక్, డాక్టర్ రాజేంద్రప్రసాద్ ట్రైనింగ్ విజయవంతంగా పూర్తి చేసి సర్టిఫికెట్లు అందుకోవడంతో కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఇంద్రనీల్, ప్రిన్సిపాల్ ఈశ్వరయ్య, సెక్రటరీ సతీశ్‌కుమార్ అభినందనలు తెలిపారు.

కేంద్ర మంత్రి 'బండి'ని కలిసిన ముదిరాజ్‌లు
చిగురుమామిడి: కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్‌ను మండల కేంద్రానికి చెందిన ముదిరాజ్ సంఘం నాయకులు కరీంనగర్‌లోని మంత్రి నివాసంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పొన్నం శ్రీనివాస్ ఆధ్వర్యంలో పలు సమస్యలపై విన్నవించారు. మంత్రి సానుకూలంగా స్పందించారని శ్రీనివాస్ తెలిపారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో చిగురుమామిడి మత్స్యపారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు చెరుకు సంజీవ్‌కుమార్, సంఘం నాయకులు పొన్నం వెంకట్రాజయ్య, డైరెక్టర్ మల్లం సదానందం ఉన్నారు.

'సుడా' గ్రామాల అభివృద్ధికి కృషి
గన్నేరువరం: సుడా పరిధిలోని గ్రామాల అభివృద్ధికి కృషి చేయనున్నట్లు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని మాదాపూర్ ఊర చెరువు కట్టపై సుడా ఆధ్వర్యంలో రూ.20 లక్షలతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను బుధవారం రాత్రి ప్రారంభించారు. మండలంలోని మైలారం మైసమ్మ గుట్ట నుంచి కరీంనగర్ వరకు మానేరు వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేయాలని కోరుతూ బ్రిడ్జి సాధన కమిటీ చైర్మన్ సంపతి ఉదయ్‌కుమార్ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు కొమ్మెర రవీందర్‌రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు గంగాధర అంజనేయులు, నందికొండ తిరుపతిరెడ్డి, మాజీ సర్పంచ్ కుమ్మరి సంపత్, కళ్లెం మల్లారెడ్డి, మార్గం మల్లేశం, గ్రామస్తులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి
గంగాధర: గామ ఫౌండేషన్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అందించే సేవలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ట్రస్ట్ ఫౌండర్ దుర్గాప్రసాద్ పిలుపునిచ్చారు. మండలంలోని మధురానగర్ చౌరస్తాలో బుధవారం చొప్పదండి నియోజకవర్గ ప్రాజెక్టు డైరెక్టర్ పాల్ ఆధ్వర్యంలో తహసీల్దార్ అనుపమరావుతో కలిసి కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆహారభద్రత కింద రెండు వందల మందికి నిత్యావసర వస్తువులు, జీవనాభివృద్ధి కింద 60 మందికి వెయ్యిరూపాయల పెన్షన్ అందజేశారు. నిత్యావసర వస్తువులు, పెన్షన్‌ను లబ్ధిదారులకు 8 నెలలపాటు అందజేస్తామన్నారు. ఎంపీడీవో జనార్దన్‌రెడ్డి, కరీంనగర్ డీసీవో సరోజ, వైస్ చైర్మన్ స్వప్న, చొప్పదండి ఎంసీవో సురేశ్, గంగాధర ఎంసీవో సతీశ్, రాకేశ్ శర్మ, మునీశ్‌రావు, కళ్యాణ్, ద్యావ సురేశ్, శేఖర్, వినోద్, అనిల్, రాజేందర్, శిరీష, సురేఖ, సమత, అనూష, అనిత ఉన్నారు.

ప్రజాభిప్రాయ సేకరణ
శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు గ్రామ పంచాయతీలో బుధవారం పెద్దమ్మ ఆలయం పరిహారం, స్థలం ఎంపికపై ఆర్డీవో రమేశ్‌బాబు ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. జాతీయ రహదారి విస్తరణలో కొత్తగట్టు శివారులోని పెద్దమ్మ ఆలయం తొలగిస్తుండటంతో ప్రభుత్వం రూ.8.20 లక్షల పరిహారం మంజూరు చేసింది. విగ్రహాలు, బోర్‌బావికి పరిహారం ప్రకటించలేదు. ఈమేరకు ఆర్డీవో పరిహారం, ఆలయం నిర్మాణం కోసం సర్వే నంబర్ 140లో పది గుంటల స్థలం కేటాయింపుపై ప్రజాభిప్రాయం తీసుకున్నారు. ఇళ్లు కోల్పోతున్న బాధితులు పరిహారం ఇప్పించాలని ఆర్డీవోకు బాధితులు మొరపెట్టుకున్నారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ భాస్కర్, ఎంపీడీవో ప్రభాకర్, మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు తిరుపతి, సమ్మయ్య, ప్రభాకర్, చైర్మన్ మల్లారెడ్డి, మాజీ సర్పంచ్ కిషన్‌రావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

- **బాధ్యతలు స్వీకరణ**

గన్నేరువరం: గన్నేరువరం ఎంపీవో శ్రీనివాస్ బుధవారం ఎంపీడీవోగా అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీవో శంకర్ ఇటీవల మండల పరిషత్‌లో నిర్వహించిన జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ప్రజావేదికకు హాజరుకాకపోవడం, సక్రమంగా విధులు నిర్వహించకపోవడంతో ఆయనను జెడ్పీసీఈవో పవన్ పంచాయతీరాజ్ కమిషనర్‌కు సరెండర్ చేసినట్లు తెలిపారు.

- **నియామకం**


గన్నేరువరం: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం గన్నేరువరం మండల కన్వీనర్‌గా పీచుపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పీచు చంద్రారెడ్డి నియామకమయ్యారని ఫోరం రాష్ట్ర చైర్మన్ చీమ శ్రీనివాస్ బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా సహకరించిన ఉద్యమకారులు, నాయకులకు చంద్రారెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు. ఉద్యమకారుల సమస్యల సాధనకు తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

- **పీఆర్టీయూటీఎస్ ఉపాధ్యక్షుల ఎన్నిక**

రామడుగు: మండలంలోని రుద్రారం, దేశరాజ్‌పల్లి కొక్కెరకుంట, వెలిచాల స్కూల్ టీచర్లు అవధూత శ్రీనివాస్, ఎం. రవీందర్‌రెడ్డి, ఎండీ ముజీబ్, జి. శ్రీనివాస్‌రెడ్డి పీఆర్టీయూటీఎస్ ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో నిర్వహించిన పీఆర్‌టీయూటీఎస్ 35వ కౌన్సిల్ సమావేశంలో వీరిని ఎన్నుకున్నారు. ఎన్నికైన సభ్యులను రామడుగు మండల అధ్యక్షుడు చాడ శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆర్.సత్యనారాయణరెడ్డి అభినందనలు తెలిపారు.

అసోసియేట్ కార్యదర్శిగా రాములు

హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాల టీచర్ మ్యాక రాములు పీఆర్టీయూటీఎస్ అసోసియేట్ కార్యదర్శిగా ఎంపికయ్యారు. ఇటీవల హైదరాబాదులో జరిగిన రాష్ట్రస్థాయి పీఆర్టీయూ సమావేశాల్లో రాములుకు పదవి లభించింది. టీచర్‌గా పీఆర్టీయూ నాయకుడిగా వివిధ హోదాల్లో పనిచేసిన రాములుకు పదవి రావడం పట్ల హుజూరాబాద్ మండల నాయకులు మాధవరావు, భాగ్యరేఖ హర్షం వ్యక్తం చేశారు.

బతుకమ్మ సంబరాలు

హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ఆవరణలో బుధవారం బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మల చుట్టూ ఆడిపాడారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ నాయకురాలు పుష్పలత, శివరేణుకా, సుశీల, రజిత, తిరుమల, మల్లీశ్వరి, మంజుల, రాధ, సునీత, స్వప్న, స్వరూప, తదితరులు ఉన్నారు.


రామడుగు: మండల కేంద్రం నుంచి శ్రీరాములపల్లికి వెళ్లే రోడ్డును పిచ్చిమొక్కలు కమ్మేస్తున్నాయి. దీంతో రాకపోకలకు ఇబ్బందిపడుతున్నామని, ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పిచ్చిమొక్కలను తొలగించడంతో పాటు రోడ్డును కమ్మేస్తున్న చెట్ల కొమ్మలను తొలగించాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
రాజేశ్వరి, ఎంపీడీవో, రామడుగు సెల్ నంబర్: 96403 33888

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9848408781, 8790144227, 9553955664

'నేడే సద్దుల బతుకమ్మ'
జమ్మికుంట: పట్టణంలోని గాంధీ చౌరస్తాలో బుధవారం పూల కొనుగోళ్లతో సందడి వాతవరణం నెలకొంది. గునుగు, పట్టుకుచ్చు, తంగెడు, టేకు, బంతి, చామంతి పూలతో పాటు తదితర రకాలను చిరువ్యాపారులు అమ్మకానికి తీసుకువచ్చారు. ప్రజలు కొనుగోలు చేసేందుకు బారులు తీరారు. మున్సిపల్ కమిషనర్ అయాజ్, గ్రామ పంచాయితీలలో ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మకు ఏర్పాట్లు చేశారు.

చొప్పదండి: పట్టణంలో సద్దుల బతుకమ్మకు మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.


గాంధీచౌరస్తాలో చిరువ్యాపారుల పూల అమ్మకాలు

బతుకమ్మ సంబరాలను నిర్వహించిన చోట నుండి ర్యాలీగా కుడి చెరువు కట్టపైకి వచ్చి బతుకమ్మలను నిమజ్జనం చేస్తారు. కుడి చెరువు కట్టతో పాటు, శనగ కుంట, బ్రాహ్మణి కుంట, తదితర ప్రాంతాల్లో నిమజ్జనానికి ఏర్పాట్లు చేశారు.

ఆధ్యాత్మికం

మహా చండీయాగం

చండీయాగంలో వేదపండితులు, భక్తులు

జమ్మికుంట: మున్సిపల్ పరిధి హౌజింగ్ బోర్డు కాలనీలోని దుర్గామాత మండపంలో ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు ప్రసాదాచార్యులు, కిషోరాచార్యులు,హర్షచార్యులు ఆధ్వర్యంలో మహా చండీయాగం నిర్వహించారు. దుర్గామాత సరస్వతీ అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. కాలనీవాసులు, భక్తులు భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మహా అన్నదానం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు, వ్యాపారులు జి.రాజమౌళి, ముక్క జితేంద్రగుప్తా, దుర్గామాత సేవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వెండి కళ్లు బహూకరణ

గన్నేరువరం: మండలంలోని ఖాసీంపేట గ్రామంలో నవదుర్గ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాతకు బుధవారం గ్రామానికి చెందిన బోయిని దుర్గాప్రసాద్‌పద్మ దంపతులు, కుటుంబసభ్యులతో కలిసి వెండి కళ్లు బహూకరించారు. అలాగే యువజన కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ బద్దం సంపత్‌రెడ్డి, నాయకులు పరిపూర్ణాచారి అమ్మవారిని దర్శించుకున్నారు. పరిపూర్ణాచారి భక్తులకు అన్నదానం, ప్రసాదం వితరణ చేశారు.


చెక్కు అందజేస్తున్న కొడిగూటి శారదప్రవీణ్

విరాళం అందజేత

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని శాలపల్లి-ఇందిరానగర్‌లో ప్రతిష్ఠించిన దుర్గాదేవి మండపంలో మాజీ సర్పంచ్ కొడిగూటి శారదప్రవీణ్ బుధవారంపూజలు చేశారు. అనంతరం రూ.50 వేల విరాళం చెక్కు దుర్గాదేవి ఈగల్ యూత్ అసోసియేషన్ సభ్యులకు అందజేశారు. అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని వేడుకున్నారు.

చెడువ్యసనాలకు బానిసవ్వొద్దు

సైదాపూర్: విద్యార్థులు, యువత చెడువ్యసనాలకు బానిసై బంగారు భవిష్యత్ నాశనం చేసుకోవద్దని హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ సూచించారు. మండలంలోని ఆరెపల్లిలో నెలకొల్పిన దుర్గామాతకు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. పండులు ప్రశాంతంగా గొడవలు లేకుండా నిర్వహించుకోవాలని కోరారు. అనంతరం మండపాల నిర్వాహకులు ఏసీపీని శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో నిర్వాహకులు వెంగళ ప్రశాంత్, గొంగళ్ల కుమార్, దుమాల శ్రీధర్, మోహన్‌రావు, దోకిడి తిరుపతి, శ్రీనివాస్ ఉన్నారు.

క్రైం వార్తలు

మహిళను వేధించిన వ్యక్తిపై కేసు
జమ్మికుంట: మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై బుధవారం కేసు నమోదు చేశామని టౌన్ సీఐ వరంగంటి రవి తెలిపారు. మండలంలోని పాపయ్యపల్లి గ్రామానికి చెందిన మహిళ చేను వద్దకు వెళ్తున్న సమయంలో అదే గ్రామానికి చెందిన అంబరగొండ వీరేశం వెకిలి చేష్టలతో మానసికంగా వేధింపులకు పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

ఫోర్జరీ కాగితాలు సృష్టించిన వ్యక్తిపై..
జమ్మికుంట: ఫోర్జరీ కాగితాలు సృష్టించిన ఓ వ్యక్తిపై తహసీల్దార్ రమేశ్ ఆదేశాల మేరకు కేసు నమోదు చేశామని టౌన్ సీఐ వరంగంటి రవి బుధవారం తెలిపారు. కొత్తపల్లికి చెందిన కాటిపల్లి రాజు సర్వేనంబర్ 464లో నాలుగు గుంటల భూమికి సంబంధించి ఫోర్జరీ కాగితాలు, స్టాంప్‌లను తయారు చేసుకున్నాడు. భూమి పక్కన వ్యక్తితో గొడవ కారణంగా విషయం వెలుగులోకి వచ్చింది.